# "దేవుడూ వర్ధిల్లు"

రచన:
గంటేడ గౌరునాయుడు

"ఏమండీ...." భర్త ముంగురుల్ని సవరిస్తూ అంది కరుణ గోముగా.

"ఊఁ.... !" అన్నారు పరధ్యానంగావున్న కరుణభర్త కుమార్.

"ఏఁవిటీ ఆలోచిస్తున్నారు ?"

"అబ్బే....ఏం లేదు...." అన్నాడు ఆమెవైపు తిరిగి పైన చెయ్యి వేస్తూ.

"ఏమండీ....మనం...."

"ఊఁ....మనం....చెప్పు ఏం చేద్దాం !"

"మనం రేపు గుడి కెళ్దామండీ !" అంది ప్రాధేయ పూర్వకంగా.

"గుడికా !?" ఆశ్చర్యంగా చూశాడామె వేపు. పెళ్ళి అయిన కొత్తలో కరుణ తనను గుడికి రమ్మనడం, తాను గుడివరకు వెళ్ళి బయట ఆగిపోయి, ఆమెను పంపించడం చూసి....తరువాత తనతో గుడికి రమ్మని పిలవడం మానేసింది కరుణ.

మళ్ళీ యిప్పుడు "కరుణా ! గుడికి రావడం అంటే నాకిష్టం వుండదని నీకు తెల్సు. ఇంకా నన్ను యిబ్బంది పెడతావెందుకు ! నిన్ను వెళ్ళొద్దనలేదుగా ! ఆమె చేతిని తన చేతిలోకి తీసుకుంటూ ఆప్యాయంగా అన్నాడు.

"అది కాదండీ ! ఆ గుడికి భార్యాభర్తలు యిద్దరూ వెళ్ళి అభిషేకం చేస్తే ..." అని ఆగిపోయింది.

"ఆఁ....అభిషేకం చేస్తే—పండంటి పిల్లాడు పుడతాడని అందరూ అంటున్నారండీ అంటావ్ - అంతే కదా !" నవ్వుతూ అన్నాడు.

అతనికి తెలుసు - పిల్లల కోసం కరుణ ఎంత తపించి పోతుందో ! పెళ్ళయి నాలుగేళ్ళు దాటినా, తమకు పిల్లలు కలక్క పోవడంతో తనకింక పిల్లలు పుట్టరేమోనన్న దిగులు ఆమెలో చోటు చేసుకుంది. ఎప్పుడూ పూజలు, వ్రతాలు, నోములు ఉపవాసాలతో చిక్కి సగమయింది !

పక్కింటి వాళ్ళ బంధువెవరో పట్నంలో క్రొత్తగా వెలసిన అమ్మవారి గుడికి వెళ్ళి అభిషేకం చేస్తే పది సంవత్సరాలుగా పిల్లలు లేని ఆ దంపతులకు పండులాంటి మగపిల్లాడు పుట్టాడట ! పక్కింటి పార్వతమ్మ దాన్ని చిలవలు పలవలుగా అల్లి చెప్పడంతో కరుణకు ఎంత తొందరగా గుడికి వెళ్దామా అన్న ఆత్రం పట్టుకుంది. కానీ భర్తను గుడికి తీసుకు వెళ్ళడం ఎలా ?

"దేవుడే వుంటే లోకంలో ఇన్ని ఘోరాలు, నేరాలు ఎందుకు జరుగుతాయి ? దీనులు, హీనులు, కూటికి గతి లేక, నిలువ నీడలేక ఎందుకు అల్లల్లాడుతున్నారు ? దేవుడు వారిని ఎందుకు ఆదుకోడు ?' ఇదీ అతని వాదన.

ఎలాగైనా యీ సారి భర్తను తనతో గుడికి తీసుకు వెళ్ళాలని పట్టుదలగా వుంది కరుణకు.

"ఏమండీ ! రేపు మనం వెళ్తున్నాం కదూ !" అంది భర్త కళ్ళలోకి చూస్తూ. అతని అంగీకారం కోసం, అతని ఛాతీ మీద వెంట్రుకలు గుప్పిటతో పట్టుకొని సుతారంగా లాగుతూ.

"కరుణా ! పిల్లలు కావాలంటే రాళ్ళకు, రప్పలకు మొక్కడం కాదు చెయ్యవలసింది - డాక్టర్లను సంప్రదించడం, ఆస్పత్రులకు ప్రదక్షిణలు చెయ్యడం అవసరం ! పద రేపు డాక్టర్ దగ్గరకు వెళ్దాం. మా ఆఫీసులో పని చేస్తున్న రామం వాళ్ళన్నయ్య, వదినగారు ఇద్దరూ డాక్టర్లేనట ! మనలాంటి కేసులు చాల చూశారట ! చాల మందికి పిల్లలు కలిగారట !" అన్నాడు. ఆమె నడుము మీద చేయి వేసి దగ్గరకు లాక్కుంటూ.

డాక్టర్ దగ్గరకు వెళ్తే మాత్రం గుడి కెళ్ళకూడదన్న రూలేం లేదుకదా ! ఒకసారి వెళ్తే ఏమీ తప్పు కాదుగా !" అంది కరుణ గారాముగా, భర్త ముక్కుమీద చూపుడు వేలుతో రాస్తూ.

"కరుణా ! నీవు చదువుకున్న దానివి. ఇంకా పల్లెటూరి మొద్దులా, మూర్ఖంగా మాట్లాడతావేం ? వైజ్ఞానికంగా ఎదగనినాడు మనిషి పిల్లల కోసం రాళ్ళు రప్పలకూ మొక్కాడు. ఇక ఆపండి బాబూ, ఉపన్యాసం !" అంటూ అతని పెదవులు తన పొడవాటి సున్నితమైన వ్రేళ్ళతో మూసింది. "నన్ను పల్లెటూరి మొద్దు అన్నా, మూర్ఖురాలు అన్నా పరవాలేదు ! " అని అతడి మెడచుట్టూ చేతులు వేసి, "ప్లీజ్ ! యీ ఒక్కసారి....ఒకే ఒక్కసారి నా కోరిక మన్నించండి....మరోసారి రమ్మని పిలవనుగా....ఆ....వస్తారు. మా వారు చాల మంచివారు !" అంటూ తన పెదవులను భర్త పెదవులకు ఆనించి, 'చ్ప' అని చప్పుడు చేసింది. ఆ చప్పుడుకు టేబుల్ మీద పత్రిక చూస్తున్న పిలుక వీళ్ళిద్దరి వేపు చూడసాగింది.

"కరుణా! అసలు తప్పంతా నీదే...."

"నేనేం చేశాను?" అంది కరుణ అమాయకంగా.

"నెలలో పాతిక రోజులు నీ పూజలు, నమస్కారాలు, వ్రతాలు, ఉపవాసాలతో నన్ను కూడా ఉపవాసాలుంచుతున్నావ్. మరి అది పాపం కాదూ? ఆ పాపం చుట్టుకునే మన పిల్లలు...."

"ఛీ.. పొండి. మీరు మరీను!" అంది చిన్నపిల్లలా మూతి సున్నాలా చుట్టి.

"ఈ పోజు చాలా బాగుంది!" అంటూ భార్య పెదాలపై తన పెదాలతో ముద్రవేసి మీదికి లాక్కుని బాహువుల్లో బంధించాడు.

"ఇంతకూ మీరేమంటారు?" అంది కౌగిలి నుండి బయటపడే ప్రయత్నం చేస్తున్నట్లు నటిస్తూ.

"సరే గాని, లైటు తీసేయనా?" అన్నాడు చిలిపిగా.

"ఉహుఁ - గుడికి వెళదామంటేనే...." అంది కవ్వింపుగా.

"కాదు; డాక్టర్ దగ్గరకే!...." అన్నాడు మొండిగా కుమార్.

"ఛీ - పొండీ!"

"పొండీ!" అని దగ్గరకు లాక్కుంటావేం?"

"ఉడికిపోయి గుప్పెళ్ళతో అతని ఛాతీ మీద కొట్ట సాగింది కరుణ.

"కరుణా! ఒక షరతు - నీతో నేను గుడికి వస్తాను. నీ కోసం.... అంటే నా అందాలరాణి కరుణ కోసం - గుడి నుండి ఆస్పత్రికి వెళ్ళి...."

"ఓ అలాగే!..." అంది కుమార్ను మీదికి లాక్కుంటూ.

అంతవరకూ వీళ్ళనే గమనిస్తున్న ఎలుక తుర్రుమంది ఎక్కడికో. ఆ గదిలో లేత నీలంరంగు వెలుగు పరుచుకుంది. పడుచుజంట పసందు చూసి పట్టిమంచం పరువు పరవశించి మెత్తగా, మత్తుగా మూలిగింది.

* * *

ఆదొక చిన్న గుడి. అదొక గుట్టపై వుంది.

ఆ ఆవరణంతా భక్తులతో కిటకిటలాడుతోంది. కళకళలాడుతోంది. ఎక్కడ చూసినా జంటలే. భార్యాభర్తలు, క్రొత్తగా పెళ్ళైనవారు, వయసు పైబడ్డవారు.... వెళ్ళేవాళ్ళు


LPC

ఎల్. పి. సి. మోనోబ్లాకు రెండు స్టేజీ డీప్ వెల్

జెట్ పంపులు



రెండు స్టేజి పంపులు ఎక్కువగా అతిప్రెషర్‌లో సాధారణ జెట్ పంపుకన్నా నీళ్ళ నందించును.

ఎంత లోతైన బావినుండి అయినా సరే మా మోనోబ్లాకు, జెట్ పంపు సెట్టులు అతిసులువుగా మీకు నీళ్ళు అందించును. ½ H.P. నుంచి 5 H.P. వరకు దొరకును.




వివరములకు

Grams: "NAIDUBROS" Phone Office: 24997 Works: 22757

THE EL-P-EM INDUSTRIALS

339, Mettupalaym Road, (P. B. No. 1053) COIMBATORE-641002

SALES BRANCHES:-

112, Zeera, Secunderabad - 3.

13/85, Jayachamarajendra Road, Bangalore - 2.

10, Municipal Market Building, Kokkalai, Trichur-1.

వెళ్తున్నారు....వచ్చేవారు వస్తున్నారు. పూజాద్రవ్యాలు అమ్మేవారితోనూ, భక్తులతోనూ, ముష్టివాళ్ళతోనూ అంతా సందడిగా వుంది.

కరుణ, కుమార్‌లు క్యూలో నిల్చున్నారు....

కరుణ ముందున్నావిడ మరో అమ్మాయితో చెబుతోంది. "యీ పూజారిగారు చిన్నకుర్రాడేనట. బి. ఏ. చదువుతుండగా ఆ అబ్బాయికి అమ్మవారు ఆవహించిందట. ఒకరోజు కాలేజినుండి ఇంటికి వెళ్ళకుండా తిన్నగా యీ గుట్టమీదికి వచ్చి ధ్యానంలో కూర్చున్నాడట. అమ్మవారు అతని కలలో కన్పించి, తాను యీ గుట్టపై వెలుస్తున్నట్లు....అక్కడ ఓచోట త్రవ్వితే తన విగ్రహం దొరుకుతుందని చెప్పిందట. తనను భక్తిగా కొల్చిన ఇంటకు సంతానం అనుగ్రహిస్తానని చెప్పి అంతర్థానమయ్యిందట. అప్పటినుండి యిక్కడికి భక్తులు రావడం, మ్రొక్కులు చెల్లించడం చేస్తున్నారట...."

ఇదంతా విన్న కుమార్‌కు ఏదో గుర్తువచ్చినట్లయింది. ఇంతలో క్యూ తరిగి తాము గుడిలోకి వెళ్ళడానికి వీలయ్యింది. పూజారిని చూశాడు కుమార్....నిజమే కుర్రాడే. పరీక్షగా చూశాడు. ఆ దీపధూపాల వెలుగులో అంత స్పష్టంగా కనిపించకపోయినా.... తనకు బాగా పరిచయం వున్న ముఖమే అది....ఎవరూ? కొద్దిసేపు ఆలోచించాడు. గుర్తొచ్చింది. తనకు బాగా పరిచయమున్న వ్యక్తి. అతడు పేరిశాస్త్రి. కొద్దిగా ఒళ్ళు చేశాడు. చేతికి ఒక కంకణం లాటిదేదో వుంది. బంగారందే కాబోలు. ఓహ్ - పేరిశాస్త్రి. ఒకప్పుడు కాలేజి ఫీజు కోసం, పుస్తకాల కోసం తన సహాయాన్ని అర్థించిన పేరిశాస్త్రి. ఇంటిదగ్గర భత్యం లేదని వుపవాసాలుండి చదివిన పేరిశాస్త్రి.

కుమార్‌కో సంఘటన గుర్తొచ్చింది.

ఒకరోజు తను, తన మిత్రుడు రాజు, పేరిశాస్త్రి మాట్లాడుకుంటున్నారు. పేరిశాస్త్రి తన యింటి పరిస్థితి దీనంగా వినిపిస్తున్నాడు. అప్పుడు తను అన్నాడు. "పేరిశాస్త్రీ! మనది కర్మభూమి. నూటికి తొంభై మంది భక్తులే! దేవుడి పేరుతో వ్యాపారం గిట్టుబాటుగా వుంటుంది. మనమూ ఒక దేవతను సృష్టిస్తే....ఎలా వుంటుందంటావ్?.... ఉద్యోగం వేట కంటే అదే నయం!" అన్నాడు తనుహాస్యాస్పదంగా. సరదాగా అన్న మాటల్ని పేరిశాస్త్రి నిజం చేశాడు. జనాలను నమ్మించ గలిగాడు: సంపాదిస్తున్నాడు.

"ఓహ్ - పేరిశాస్త్రి తెలివైన వాడివే అనుకున్నాడు కుమార్.

కరుణ రెండు కళ్ళూ మూసి, చేతులు జోడించి నమస్కరిస్తోంది.

"హుం - దేవుడు....తాను వచ్చి దీనులను ఆదుకోలేకపోయినా, తెలివైనవాడు దేవుడి పేరుతో హాయిగా బ్రతికేస్తున్నాడు."

కుమార్ పేరిశాస్త్రిని పలుకరించలేదు. పేరిశాస్త్రి కూడా ఆ హడావుడిలో కుమార్‌ను గమనించలేదు.

గుడి నుండి బయటకు వచ్చి కరుణ, కుమార్ లిద్దరూ రిక్షాలో 'పద్మజా క్లినిక్' అన్న బోర్డు చూపి ఆగి, క్లినిక్ లోపలికి వెళ్ళారు.

కరుణ, కుమార్‌లను విడి-విడిగా పరీక్షించిన మీదట, కొన్ని మందులు వ్రాసి, మరో వారం తరువాత రమ్మన్నారు డాక్టర్.

అలాగే క్రమం తప్పకుండా మందులు వాడాక యిద్దరూ.

కరుణ క్రమం తప్పకుండా గుడికి వెళ్తూనేవుంది. ప్రతిరోజూ రాత్రి టేబుల్‌మీద ఎలుక పిల్లను పలకరిస్తూనే వుంది. నరుపు సరసాలంతో మత్తుగా మూలుగుతూనేవుంది,

* * *

ఒక రోజు —

MEXICO
KNITTING MILLS
TRADE MARK

ఎల్లప్పుడూ - మాచే తయారు చేయబడిన

♦ పావ్‌లిన్ ♦ విజయ్ ♦ సిల్వర్

♦ అనిన్ ♦ బాబి ♦ రోలెక్స్

బనియన్లనే వాడండి. అవి బనియన్లకెల్లా అత్యుత్తమమైనది.

Phone: 25542

MEXICO KNITTING MILLS
5-F, Stans Road 3rd Street, TIRUPUR-638 602.

"ఏమండీ" కరుణ కళ్ళలో ఏదో వింత తేజస్సు.

ముఖం మందారంలా....తనువు మందాకినిలా .. రంగు లీనుతూ... రవళిస్తూ....

కుమార్ తన్మయంగా చూస్తున్నాడు భార్యవేపు.

"ఏమండీ. మీరు.... మీకో క్రొత్త డ్యూటీ పడబో తోంది."

"ఆ. క్రొత్త డ్యూటీయా ..."

"ఔను....చిన్నచిన్న గౌన్లు, ఫ్రాకులు, బొక్కెట్లు, పాల డబ్బాలు మోసే క్రొత్త ఉద్యోగం."

"వ్వాట్....మన మధ్యకు ఓ బుల్లి పాపాయి రాబో తుందా. నేను....తండ్రి హోదాలో కొస్తున్నానన్నమాట థాంక్యూ కరుణా? థాంక్యూ!....థాంక్యూ వెరీమచ్."

కరుణను ముద్దుల్లో ముంచెత్తాడు కుమార్ ఆనందంతో.

టేబుల్‌మీద ఎలుక కిచకిచలాడి తన సంతోషాన్ని వ్యక్తంచేసి పారిపోయింది తన ప్రియురాలిచెంతకు.

"ఏమండీ చూశారా....మన యిద్దరం గుడికి వెళ్ళడం ఎంత మంచి ఫలితాన్నిచ్చిందో" గర్వంగా అంది కరుణ.

"పిచ్చి కరుణా! మనం గుడికి వెళ్ళడంవల్లనే నీ కడుపు పండిందని అనుకుంటున్నావా! ఆ గుడివెనుకనున్న 'కథ' చెబితే ..."

"గుడివెనక కథా?.... వూరుకోండి..... మీకు కథలు చెప్పటం అలవాటైపోయింది" అంది నవ్వేస్తూ.

"కాదు కరుణా....నిజం. ఆ పూజారెవరో తెలుసా ... నా క్లాస్‌మేట్ 'పేరిశాస్త్రి....' జరిగిందంతా వివరించాడు కుమార్.

కరుణకు మాత్రం బాగా నమ్మకం - అమ్మవారి చలువే నని.

కుమార్ ఏమీ అనలేక పోయాడు. ఆమె మూర్ఖత్వానికి జాలి పడాలో, బాధ పడాలో కూడా అర్థం కాలేదతనికి.

"కరుణా .... డాక్టర్లకు డబ్బు పోశాం. మందులకు సొమ్ము తగలేశాం. అదంతా వృధాయే నంటావా?"

"వృధా అని ఎందుకంటానూ? ఆ మందులు పని చెయ్యాలన్నా కూడా....అమ్మవారి దయ, అనుగ్రహం

బపితావారి...
ప్రత్యేక తయారింపులు
• సీఫోర్, • చూస్త్రీ,
• రావ్ టూ, • సెలెక్ట్ ఒన్,
• దట్ సెలెక్షన్.
ఇవే మా ప్రత్యేక తయారింపులైన
జెట్టీలు - బనియన్లు.
తయారించువారు :
Phone: 22909
BAPITA KNITTERS
Lakshmi Nagar, Tirupur-638 602.

వుండాలండీ!" నోరు మూసుకున్నాడు కుమార్ - ఏం చెప్పాలో తెలియక.

కరుణకు యింకా చెప్పడం వృధాప్రయాస. ఆమె స్వచ్ఛమైన హిందూ స్త్రీ! పవిత్ర భారతనారి....ఈ కర్మ భూమిలో పుట్టి, పురాణాల రొదలో పెరిగి, శివు డాజ్ఞ లేనిదే చీమైనా కుట్టదని నమ్మిన అమాయకురాలు. ఆమె జ్వర మొస్తే మందు వాడుతుంది. జ్వరం తగ్గించమని దేవుణ్ణి ప్రార్థిస్తుంది. తగ్గితే దేవుడికి మొక్కులు చెల్లిస్తుంది. తగ్గకపోతే డాక్టర్ని తిడుతుంది. అది అంతే!

'కుమార్' లాంటి వాళ్ళు నోరు మూసుకుంటూనే వుంటారు.

'పేరిశాస్త్రి' లాంటి వాళ్ళు దేవుడి పేరుతో హాయిగా కాలం గడిపేస్తుంటారు.

'కరుణ' లాంటివారి అండదండల్తో, అమాయకత్వంతో దేవుడు కలకాలం వర్ధిల్లుతూనే వుంటా డీ దేశంలో.... వర్ధిల్లు దేవుడూ - వర్ధిల్లు! ....

